సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 26 । మార్చి । 2023



ప్రశ్నిస్తే అనర్హత వేటు వేస్తారా!

దేశాన్ని దోచుకున్న వారి గురించి మాట్లాడితే రాహుల్ గాంధీపై కేసులు పెడతారా అని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:34	సోమ : 4:53

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.4 /24.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రాజకీయాల్లో నైతిక విలువలు లోపించాయి



మోపాల్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత ఉద్యోగాల సాధించాలని, రాజకీయాలపై ఆసక్తి చూపొద్దని, ప్రస్తుత తరుణంలో రాజకీయాల్లో నైతిక విలువలు లేవని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కంజర్ ప్రాథమిక పాఠశాలలో ఉమెన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలుచేశారు. యువత రాజకీయాలకు ఆకర్షితులు కావొద్దని హితవు పలికారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని సూచించారు. రాజకీయాలు చిల్లరగా మారిపోయాయని, మంచి వారికి ఎదిగే అవకాశం లేదన్నారు. అలాగే నర్సింగ్‌పల్లి, సిర్‌పూర్, మోపాల్, కులాస్‌పూర్ గ్రామాల్లో జీజీ కళాశాల, ఎస్‌వీ, ఉమెన్స్ కళాశాల యూనిట్ల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ లతాకన్నీరాం, సర్పంచులు భరత్, క్యాతం రవి, ముత్యంరెడ్డి, సాయిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రావు, ఉమాపతిరావు, నరేష్ నాయక్, భూమయ్య పాల్గొన్నారు.

వృద్ధురాలిని గాయపరిచిన కుక్క



నవీపేట : నవీపేట మండలంలోని బినోల గ్రామంలో శనివారం వృద్ధురాలు బాగిర్తి (66)పై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఆవరణలో నిద్రిస్తున్న వృద్ధురాలిపై కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. రెండు చేతులకు గాయాలు కాగా బాధితురాలికి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

మానసిక ఒత్తిడిని జయించాలి




పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలంటే మానసిక ఒత్తిడిని జయించాలని జిల్లా ఆయూష్ అధికారి డాక్టర్ రమణ మోహన్ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలకు శనివారం ఆయూష్ ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మోహన్ మాట్లాడుతూ పదో తగరతి విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ఉత్సాహంగా పరీక్షలను రాయడానికి ప్రభుత్వం ఆయూష్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థినిలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి విధిగా పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థినిలకు ఆయూష్ కిట్లను ఇతర తరగతుల విద్యార్థినిలకు పోషకాహార లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినిలు స్రవంతి, నవనీత, ఏఎన్‌ఎం విక్టోరియా, ఆయూష్ ఫార్మసిస్టు పురుషోత్తం, స్వరూప రాణి, పాల్‌రాజ్, సుచరిత, మహేందర్, రమేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మొదటి సంవత్సరం భౌతికశాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 191,90 మంది విద్యార్థులకుగాను 18,204 విద్యార్థులు పరీక్షలు రాశారు,. 986 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నాందేడ్‌లో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

నిజాంసాగర్: నాందేడ్ జిల్లా లోహలో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లను శనివారం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ పరిశీలించారు. మహారాష్ట్రలోని ఆయా జిల్లాల ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులతో సభ ఏర్పాట్లు, జన సమీకరణపై సమీక్షించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, షకీల్ తదితరులు ఉన్నారు.



యాదారంలో రైతు నిర్మించుకున్న ఇల్లు

ఫార్మర్ హౌజ్..!


బడాబాబులు ఎకరాల కొద్దీ భూములు కొని పెద్దపెద్ద 'ఫాం హౌజ్'లు నిర్మించుకోవడం చూస్తుంటాం. అక్కడికి వీకెండ్‌లలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో వెళ్లి జల్సా చేయడం సాధారణంగా మారిపోయింది. అయితే మట్టినే నమ్ముకున్న రైతన్నలు సైతం ఫాం హౌజ్‌లు కట్టుకుంటున్నారు. చాలామంది రైతులు పొద్దంతా చమటోడ్చే చోటే ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. ఫార్మర్ హౌజ్‌లపై సండే స్పెషల్

– సాక్షి, కామారెడ్డి

- చేను వద్దే ఆవాసం
- పనులు చూసుకోవడం సులువైందంటున్న రైతులు

సండే స్పెషల్

జిల్లాలో చాలామంది రైతులు పొలాల వద్ద ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ముఖ్యంగా రోడ్ల వెంట భూములు ఉన్న రైతులు.. అక్కడే ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. కామారెడ్డి, తాడ్వాయి, రాజంపేట, గాంధారి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో పొలాల్లో రైతుల ఇళ్లు కనిపిస్తాయి. గతంలో ఊళ్లో ఇల్లు ఉంటే.. పొలం దూరాన ఉండేది. అక్కడికి వెళ్లి పనులు చూసుకుని సూర్యాస్తమయ సమయానికి ఇల్లు చేరుకునేవారు. రాత్రి వేళలో పంటలకు కాపాలాకు వెళ్లేవారు పొలాల వద్ద మంచెలు ఏర్పాటు చేసుకునేవారు. పశువుల కోసం కొట్టాలుండేవి. కొందరు పొలంలోనే ఇల్లు కుట్టుకున్నా.. ఊరికి దూరంగా ఇల్లు ఉండడంతో దొంగల భయం ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. దొంగల భయం తగ్గడంతో పొలాల వద్ద ఇల్లు కట్టుకోవడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు.



కృష్ణాజీవాడి శివారులో..

పనులకు అనుకూలం..

ఊళ్లో ఇంట్లో ఉన్నపుడు పొలం వద్దకు వచ్చేసరికి ఆలస్యం అయ్యేది. పొలం వద్దే ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉంటుండడంతో పొద్దున లేవగానే పనులు చూసుకునే అవకాశం కలిగింది. కావలసినన్ని కూరగాయలు పండించుకుంటున్నం. పచ్చని పంట చేను మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో ఉంటున్నాం.

– రాంచంద్రం, రైతు, యాదారం, బీబీపేట మండలం



ఆర్గొండ శివారులో పొలం వద్ద రైతు నిర్మించుకున్న ఇల్లు

ఏ ఇబ్బందీ లేదు..



పొలం వద్ద ఇల్లు కట్టుకున్నం. ఇక్కడే ఉంటూ ఎకరం పొలంలో కూరగాయలు సాగు చేస్తున్నాం. పొలంలో ఇల్లు కట్టుకోవడంతో కూరగాయల పంట మీదకు కోతులు, ఇతర జంతువులు రాకుండా చూసుకోవడానికి వీలు కలిగింది. ఏ ఇబ్బందీ లేకుండా ఉండగలుగుతున్నాం. – జంగం దేవదాస్, రైతు, ఆర్గొండ

ప్రశాంత వాతావరణంలో...



నేను టీచర్‌గా పనిచేస్తాను. వ్యవసాయ పనులు చూసుకుంటాను. పొలం వద్దే ఇల్లు కట్టుకున్నం. ఫ్యామిలీ మొత్తం అందులోకి షిఫ్ట్ అయ్యాం. పసుపు, మక్క పంటలు సాగు చేస్తున్నాం. కూరగాయలు కూడా పండిస్తాం. పొలం వద్ద ప్రశాంత వాతావరణంలో నివసిస్తున్నాం.

– నీరడి జైపాల్, టీచర్, కృష్ణాజీవాడి, తాడ్వాయి మండలం

రెండిళ్లు కడుతున్న..



మాకు ఊళ్లో ఇల్లు చిన్నగా ఉండడంతో కొంత ఇబ్బంది ఉండేది. ఇల్లు కట్టుకుందామని ఆలోచన చేసి, రోడ్డుకు సమీపంలో ఉన్న పొలం వద్ద నిర్మించుకున్నాం. ఇక్కడ ప్రశాంతంగా ఉంది. పొలం పనులు చూసుకోవడానికి సులువుగా ఉంది. ఇద్దరు కొడుకుల కోసం రెండు ఇళ్లు కడుతున్నా.

-కుమ్మరి కిషన్, రైతు, కృష్ణాజీవాడి, తాడ్వాయి మండలం

స్థాయిని బట్టి నిర్మాణాలు..



మహదేవునిపల్లిలో పొలం వద్ద రైతు నిర్మించుకున్న ఇల్లు

రైతులు తమ ఆర్థికశక్తికి అనుగుణంగా పొలాలలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఇంటిలో అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించుకుంటున్నారు. కొంతమంది రక్షణ కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. పొలం వద్ద ఇల్లు ఉండడం వల్ల పనులు చేసుకోవడం సులువు అవుతోందని పేర్కొంటున్నారు. ఇంటికి అవసరమైన కూరగాయలు కూడా పండించుకుంటున్నామంటున్నారు. కూరగాయల పంటలపై కోతులు ఇతర అడవి జంతువుల దాడి ఎక్కువగా ఉంటుందని, వాటిని కాపాడుకోవడానికి గతంలో ఇబ్బందిపడేవారమని పేర్కొంటున్నారు. ఇప్పుడు పొలం వద్దే ఇల్లు ఉండడంతో పంటలను కాపాడుకోగలుగుతున్నామని చెబుతున్నారు. పశువులను చూసుకోవడానికీ సమయం దొరుకుతోందంటున్నారు.



ఆర్గొండ శివారులో పొలం వద్ద రైతు జంగం దేవదాస్ నిర్మించుకున్న ఇల్లు

సుపరిపాలనతోనే అవార్డుల పంట

- తెలంగాణకు జాతీయస్థాయిలో గుర్తింపు
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- అట్టహాసంగా జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం



కమ్మర్‌పల్లి జీపీకి అవార్డు అందజేస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ఫలితంగా తెలంగాణకు జాతీయ అవార్డుల పంట పండుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ దార్శనికత, సమర్థవంతమైన నిర్ణయాలను క్షేత్రస్థాయి వరకు పకడ్బందీగా అమలు చేస్తుండడంతో తెలంగాణలోని పంచాయతీలు స్వపరిపాలనలో ముందంజలో ఉన్నాయని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హాజరయ్యారు. ఎంపిక చేసిన తొమ్మిది అంశాల్లో ఉత్తమ జీపీలుగా ఎంపికైన గ్రామ పంచాయతీల పాలక వర్గాలకు మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సుపరిపాలనతో తెలంగాణకు జాతీయస్థాయిలో వరుస అవార్డులు వరిస్తున్నాయని పేర్కొన్నారు. 2021–22 సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద కేంద్రం దేశవ్యాప్తంగా 20 ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేయగా, అందులో తెలంగాణలోని 19 గ్రామాలు ఉత్తమ జీపీలుగా ఎంపికయ్యాయని వివరించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కేటగిరీలోనూ తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని, ఉత్తమ జిల్లాల కేటగిరిలో జగిత్యాల మొదటి స్థానంలో, నిజామాబాద్ మూడో స్థానాన్ని దక్కించుకొని అవార్డులను కైవసం చేసుకున్నాయన్నారు. ఇంకా అనేక అవార్డులు సాధించిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి తెలంగాణలో పల్లెప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, కేంద్రం అందిస్తున్న నిధులకు సరిసమానంగా స్టేట్ ఫైనాన్స్ ద్వారా జీపీలకు నిధులను సమకూరుస్తోందని తెలిపారు. గత మూడున్నరేళ్లలో సుమారు రూ. 11వేల కోట్లు జీపీలకు అదనంగా అందించిందన్నారు.

కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి, డీపీవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఆర్'తో ప్రాణాలు కాపాడవచ్చు

సుభాష్‌నగర్: సీపీఆర్ అనే చిన్న ప్రక్రియ ద్వారా ఎన్నో విలువైన ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం బారి నుంచి కాపాడేందుకు వీలుగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం మంత్రి కొత్త కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఆకస్మికంగా గుండెపోటుతో ప్రాణాపాయ స్థితికి చేరిన వారికి సీపీఆర్ ప్రక్రియ ఎలా అందించాలనే దానిపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని గమనిస్తే ఏమాత్రం తాత్సారం చేయకుండా సీపీఆర్ చేయాలని సూచించారు.



సీపీఆర్ విధానాన్ని చూపిస్తున్న మంత్రి

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

అంతర్జాతీ య మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంత్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వారం తర్వాతే..!



సాయిబాబా ఆలయం వద్ద కొనసాగుతున్న ఆర్వోబీ పనులు

- మాధవనగర్ రోడ్డు మూసివేతకు మరింత గడువు
- సాయిబాబా ఆలయం వద్ద కొనసాగుతున్న ఆర్వోబీ పనులు
- వాహనాలు మోపాల్ మీదుగా వెళ్లాలని సూచిక బోర్డుల ఏర్పాటు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్ రోడ్డు మూసివేతకు అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఈ రైల్వే ట్రాక్ వద్ద ప్రస్తుతం ఆర్వోబీ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఆర్వోబీ బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన పిల్లర్ల పనులు కొనసాగుతుండడం, ఇక్కడి నుంచే వాహనాలు రాకపోకలు సాగుతుండడంతో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో శుక్రవారం పిల్లర్లకు సంబంధించిన పనుల్లో మట్టి కుప్పలు రోడ్డుకు అడ్డంగా వేయడంతో మాధవనగర్ రోడ్డు మూసివేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. మట్టి కుప్పలతో వాహనాలు నిలిచిపోవడంతో మళ్లీ వాటిని తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. పనులకు ఆటంకం ఏర్పడకుండా బోర్గాం(పి) చౌరస్తా వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పా టు చేశారు. వాహనాలు మోపాల్ మీదుగా డిచ్‌పల్లి వెళ్లాలని బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే వారం తర్వాతే రోడ్డు మూసివేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

మోపాల్ నుంచి డిచ్‌పల్లికి..

నగరం నుంచి డిచ్‌పల్లి వైపు వచ్చే వాహనాలు మోపాల్ నుంచి వెళ్లేందుకు ట్రాఫిక్ డైవర్షన్ పెట్టినట్లు అధికారులు తెలిపారు. వాహనదారులు ఈ రూట్ గుండా వెళ్తే పనులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. నగరం నుంచి వచ్చే వాహనాలు మోపాల్, కంజర్, ముల్లంగి, డిచ్‌పల్లి మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

పనులు వేగవంతం కావడంతో..

ఆర్వోబీ పనులు కొనసాగుతుండగా.. ఈ రోడ్డు మీదుగా టూ, ఫోర్, త్రీవీలర్స్‌లు వెళ్లడంతో పనులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గుంతలు తీయడంతో వాటి పక్కన ఉన్న స్థలం నుంచి వాహనాలు అధిక సంఖ్యలో వెళ్లడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అయితే వాహనాలు వెళ్లేందుకు పిల్లర్ల పక్కన నుంచి మట్టిరోడ్డును ఏర్పాటు చేశారు.

వారం రోజులు పడుతుంది

మాధవనగర్ రోడ్డు మూసివేతకు ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆర్వోబీ పనులు పనులు కొనసాగుతున్నాయి. ఫోర్ వీలర్, త్రీ వీలర్, టూ వీలర్లపై వెళ్లేవారు మోపాల్ నుంచి వెళ్లాలి. మాధవనగర్ రోడ్డును మూసివేయడానికి వారం రోజుల గడువు పట్టే అవకాశం ఉంది.

– రమేశ్, ఈఈ, ఆర్‌అండ్‌బీ, నిజామాబాద్



గడ్కోల్‌లో తడిసిన మక్కలు

వడగండ్ల వర్షంతో అపార నష్టం

సిరికొండ : నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని తాటిపల్లి, చీమన్‌పల్లి, జినిగ్యాల గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు గడ్కోల్, కొండూర్, రామడుగు, హుస్సేన్‌నగర్ తదితర గ్రామాల్లో సాధారణ వర్షం కురిసింది. వడగండ్ల వర్షానికి కోతకు వచ్చిన వరి పొలాల్లో వడ్లు రాలిపోయాయి. మూడు గ్రామాల్లో ఐదారు వందల ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. పొలాల్లో సగానికి పైగా వడ్లు రాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లు బాగా రాలిపోవడంతో వట్టి గడ్డి మాత్రమే మిగిలిందని తెలిపారు. గడ్కోల్ తదితర గ్రామాల్లో ఆరబెట్టిన మక్కలు, పసుపు తడిచిపోయాయని రైతులు తెలిపారు. కొండూర్‌లో ఆరబెట్టిన వడ్లు తడిచిపోయాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో గాలికి వడ్లు రాలినట్లు రైతులు తెలిపారు.



సిరికొండ మండలం తాటిపల్లిలో పడిన వడగండ్లు



తాటిపల్లిలో రాలిన వడ్లు

క్లుప్తంగా

102 వాహనానికి సుస్తీ

- మద్దికుంట నుంచి గర్భిణిని తరలిస్తుండగా చెడిపోయిన వాహనం



రామారెడ్డి: గర్భిణులను, బాలింతలను ఆస్పత్రికి, ఆస్పత్రి నుంచి ఇళ్లకు తరలించడానికి ఏర్పాటు చేసిన 102 వాహనాలను మూలన పడే పరిస్థితి నెలకొంది. వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి తరుచూ మొరాయిస్తున్నాయి. శనివారం సాయంత్రం రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన గర్భిణిని నార్మల్‌ చెకప్‌ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో 102 వాహనం క్లచ్‌ ప్లేట్లు చెడిపోయాయి. దీంతో మరో 102 వాహనం సాయంతో చెడిపోయిన వాహనాన్ని కామారెడ్డికి తరలించారు. మద్దికుంట గ్రామానికి చెందిన పేషెంట్‌ను మరో వాహనంలో ఆస్పత్రికి తరలించి చెకప్‌ చేయించినట్లుగా సిబ్బంది తెలిపారు.

రుణం పేరిట టోకరా

కామారెడ్డి క్రైం: మీకు రుణం మంజూరు అయిందని నమ్మబలికి ఓ వ్యాపారికి రూ.85,033 టోకరా వేశారు ఆన్‌లైన్‌ మోసగాళ్లు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లిలో వెలుగుచూసింది. గ్రామంలో నివాసం ఉండే ముస్తాల సతీష్‌ కుమార్‌ వ్యాపారి. ఈనెల 15న అతనికి ఓ ఫోన్‌ కాల్‌ వచ్చింది. అవతలి వ్యక్తి తాను బజాజ్‌ ఫైనాన్స్‌ నుంచి మాట్లాడుతున్నాననీ, మీకు రూ.రెండు లక్షలు వ్యక్తిగత రుణం మంజూరు అయిందని చెప్పాడు. రుణం పొందడానికి ఎదుటి వ్యక్తి చెప్పిన విధంగా ఇన్సూరెన్స్‌ ప్రాసెసింగ్‌, ముందస్తు మూడు ఇన్‌స్టాల్‌మెంట్‌లు, ఇతర చార్జీల పేరిట మొత్తం రూ.83,033ను విడతల వారీగా ఫోన్‌పేకు పంపమన్నాడు. దీంతో సతీష్‌కుమార్‌ అతడు చెప్పిన నంబర్‌కు డబ్బులు పంపాడు. చివరికి మోసపోయినట్లు తెలుసుకొని దేవునిపల్లి పోలీసులను శనివారం ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

మామకు తల కొరివి పెట్టిన కోడలు



మాచారెడ్డి: అనారోగ్యంతో మృతి చెందిన మామకు అన్నీ తానై చివరి మజిలీ తంతు నిర్వహించింది ఓ కోడలు.. ఈ ఘటన మండలంలోని పాల్వంచలో జరిగింది. గ్రామానికి చెందిన తోట ముత్యం(65) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఐదు నెలల కిందట ఆయన కుమారుడు స్వామి ఆత్మహత్యకు పాల్పడటంతో కోడలు నవ్య మామకు తలకొరివి పెట్టింది.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

ధర్పల్లి (ఇందల్వాయి): ఇందల్వాయి మండలం గన్నారం గ్రామ శివారులోని పొలాల వద్ద గల మూడు ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అందులోని ఆయిల్‌, కాపర్‌ వైర్‌ ఎత్తికెళ్లినట్లు డిచ్‌పల్లి ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్‌ తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఎకరాకు నీళ్లివ్వడమే లక్ష్యం

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- 21ఏ ప్యాకేజీ పనుల పరిశీలన

వేల్పూర్‌: ప్రతి ఎకరానికి సాగునీరందించడమే సీఎం కేసీఆర్‌ లక్ష్యమని రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన బాల్కొండ నియోజకవర్గంలో ప్యాకేజీ 21ఏ ద్వారా సాగునీరందించే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేల్పూర్‌, భీమ్‌గల్‌ మండలాలకు చెందిన పచ్చలనడ్కుడ, వాడి, కొత్తపల్లి ఎన్‌, చేంగల్‌, బీబీ తండా, ఎంజీ తండా గ్రామాల్లోని వాటర్‌ డిస్ట్రిబ్యూటరీ బాక్సులు, ఔట్‌లెట్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టంలను పరిశీలించారు. ఒక్కో ఓఎంఎస్‌ ద్వారా 50కి పైగా ఎకరాలకు, ఒక్కో డిస్ట్రిబ్యూటరీ చాంబర్‌ ద్వారా 12 నుంచి 15 ఎకరాలకు నీరందించే ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఇప్పటికే పచ్చలనడ్కుడ, వాడి, కొత్తపల్లి, చేంగల్‌, బీబీ తండా, ఎంబీ తండా గ్రామాల్లో 160కి పైగా ఓఎంఎస్‌ బాక్సుల నుంచి 448 డిస్ట్రిబ్యూటరీ చాంబర్స్‌ ద్వారా సుమారు 4500 ఎకరాలకు సాగునీరు అందించే ఏర్పాట్లు పూర్తయినట్లు చెప్పారు. చింతలూరు వద్ద పెద్దవాగుపై, బడాభీమ్‌గల్‌ కప్పలవాగుపై ట్యాపింగ్‌ పాయింట్స్‌ నిర్మాణాలను పరిశీలించారు. 15 రోజుల్లో వాటి పనులను పూర్తిచేసి సాగునీరందించే ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్‌ అధికారులను ఆదేశించారు. వీటి ద్వారా యాసంగిలో కూడా చెక్‌డ్యాంలకు నీరు వదిలి, వాటిని నింపే అవకాశం ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్‌ సహకారంతో ప్యాకేజీ 21 ద్వారా రూ.1650 కోట్ల వ్యయంతో 71వేల ఎకరాలకు కాళేశ్వరం జలాలు అందనున్నాయని చెప్పారు. ఆయన వెంట ఇరిగేషన్‌ అధికారులు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఏనుగు గంగారెడ్డి, నల్లరమేశ్‌, లింబారెడ్డి, సంజీవ్‌రెడ్డి, రాజారెడ్డి, గుడాల గంగాధర్‌ పాల్గొన్నారు.



పచ్చలనడ్కుడ సమీపంలో 21ఏ ప్యాకేజీ పనులు పరిశీలిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మంత్రికి దోసకాయలు అందించిన మహిళా రైతు

వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం పచ్చలనడ్కుడ సమీపంలో శనివారం ప్యాకేజీ 21 ఏ పనులను పరిశీలించడానికి వెళ్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి స్థానిక మహిళారైతు తాను పండించిన దోసకాయలను తినుమని ఇచ్చారు. పంటల సాగు ఎలా ఉందని మహిళా రైతుతో ఆయన మాట్లాడారు. అభిమానంతో తనకు దోసకాయలు ఇచ్చినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఆమె అందించిన దోసకాయలు తింటూ పనుల పరిశీలనకు మంత్రి ముందుకు సాగారు.



ప్రశ్నిస్తే అనర్హత వేటు వేస్తారా!



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: దేశాన్ని దోచుకున్న వారి గురించి మాట్లాడితే రాహుల్‌గాంధీపై కేసులు పెడతారా అని పీసీసీ రాష్ట్ర కోశాధికారి, మాజీ మంత్రి సుదర్శన్‌ రెడ్డి ప్రశ్నించారు. శనివారం నగరంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతలు రాహుల్‌గాంధీని పప్పు అని, సోనియాగాంధీని విదేశీ మహిళ అని మాట్లాడితే తప్పులేదు కాని రాహుల్‌గాంధీ దేశ సంపదను దోచుకున్నా వారి గురించి మాట్లాడిస్తే కేసులు పెట్టి లోకసభ సభ్యత్వం తీసివేస్తారా అని ప్రశ్నించారు. ఆదానికి రూ.12 లక్షల కోట్ల ప్రజలధనాన్ని మోదీ కట్టబెట్టారని ఆరోపించారు. ఎంపీ పదవికి రాహుల్‌గాంధీ అనర్హుడిగా ప్రకటించడం బాధాకరమన్నారు. రాహుల్‌ గాంధీ జోడో యాత్రకు స్పందన రావడంతోనే ఓర్వలేక బీజేపీ ఇలాంటి చర్యలకు పూనుకుందన్నారు. రాహుల్‌ గాంధీపై అనర్హత వేటు వేసి బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. కాంగ్రెస్‌ పార్టీతోపాటు రాహుల్‌గాంధీపై మోదీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఆదానీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాహుల్‌ గాంధీని బీజేపీ టార్గెట్‌ చేసిందన్నారు. ఈ కుట్రను న్యాయపోరాటం ద్వారా కాంగ్రెస్‌ ఛేదిస్తుందన్నారు. కాంగ్రెస్‌ జిల్లా మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌ బిన్‌ హుందాన్‌, ముప్ప గంగారెడ్డి, అంతిరెడ్డి రాజారెడ్డి, రత్నాకర్‌, సిరికొండ గంగారెడ్డి, మహిపాల్‌ రెడ్డి పాల్గొన్నారు.

సీపీని కలిసిన ట్రాఫిక్‌ కానిస్టేబుళ్లు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ సీపీ నాగరాజును శనివారం నిజామాబాద్‌ ట్రాఫిక్‌ కానిస్టేబుళ్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ట్రాఫిక్‌ కానిస్టేబుళ్లు మాట్లాడుతూ.. జిల్లాలో సీపీగా పనిచేసి మంచి పేరు సంపాదించిన నాగరాజుకు రుణపడి ఉంటామన్నారు. ఆయన అడుగుజాడల్లో, సూచనల మేరకు నడుచుకుంటామన్నారు. సీపీ మార్చి 31న ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఆయనను కలిశారు. కానిస్టేబుళ్లు నర్సింగ్‌, ప్రమోద్‌, సాయన్న, ఉదయ్‌, లక్ష్మణ్‌ అబ్బులు, రవి, సుభాష్‌ ఉన్నారు.

బైక్‌ చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

ఖలీల్‌వాడి: ఇద్దరు బైక్‌ దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్‌ తెలిపారు. శనివారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌ నగరంలోని సతీశ్‌నగర్‌కు చెందిన గైనికాడి సురేష్‌ జల్సాలకు అలవాటు పడి బైక్‌ల చోరీకి అలవాటు పడ్డాడు. చోరీ చేసిన బైక్‌లను నాందేడ్‌వాడకు చెందిన ముదుగుల్వాడ్‌ రాజేష్‌ అలియాస్‌ రాజుకు విక్రయించేవాడు. ఆ ఇద్దరు కలిసి శనివారం బోధన్‌ వైపు నుంచి వస్తుండగా వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్సై సాయినాథ్‌ సిబ్బంది ఆపారు. పోలీసులను చూసి వారి బైక్‌ను వదిలి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకొని విచారించగా బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నగరంలోని మార్కెట్‌ ఏరియా, ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌, ఖలీల్‌వాడి, కంఠేశ్వర్‌, దుబ్బ, నాగారం ఏరియాల్లో పలు మోటార్‌సైకిళ్లు దొంగతనం చేసినట్లు నిందితుడు సురేష్‌ తెలిపారు. సురేష్‌తో కలిసి తాను బైక్‌లు దొంగతనం చేశానని వాటిని, తక్కువకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో అమ్ముకోవడానికి దాచిపెట్టినట్లు రాజు ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నార్త్‌ సీఐ నరహరి ఆధ్వర్యంలో 15 మోటార్‌ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుడు గైక్వాడ్‌ దిలీప్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నరహరి, ఎస్సై సాయినాథ్‌, కానిస్టేబుళ్లు రామాంజనేయులు, సాయిలు, విజయ్‌, ఆనంద్‌, ప్రదీప్‌, హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్‌, రాజు ఉన్నారు.

కలెక్టరేట్‌ ఎదుట గొడుగులతో ధర్నా



పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్‌ ఎదుట శనివారం తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌, రిటైర్డ్‌ పర్సన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గొడుగులతో ధర్నా నిర్వహించారు. పీఆర్‌సీ, హెల్త్‌ స్కీం, రైల్వేలో రాయితీలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. – సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

ఏడుగురి బైండోవర్‌

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం రాత్రి రెండు వర్గాలు దాడికి పాల్పడిన ఘటనలో ఏడుగురిని నిజామాబాద్‌ రూరల్‌ తహీల్దార్‌ సుదర్శన్‌ వద్ద శనివారం బైండోవర్‌ చేశారు. ధర్మపురిహిల్స్‌లో చిన్నారి ఇంటి వద్ద వేసిన బండరాయి వేయడంతో ఈ గొడవ జరిగింది. ఇరు వర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చారు. అక్కడ రెండు వర్గాలు దాడి చేసుకోవడంతో మహమ్మద్‌ ఇమ్రాన్‌ఖాన్‌, ఫరీదా బేగం, సయ్యద్‌ అఫ్రోజ్‌, ఫర్హాన్‌బేగం, మహబూబ్‌ఖాన్‌, ఎండీ అనార్‌, షాబాజ్‌ఖాన్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- ఖరీఫ్‌లో సిద్దాపూర్‌ రిజర్వాయర్‌ నుంచి సాగునీరు అందిస్తాం
- స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రిజర్వాయర్‌ పనులను పరిశీలిస్తున్న స్పీకర్‌

వర్ని: వచ్చే ఖరీఫ్‌లో సిద్దాపూర్‌ రిజర్వాయర్‌ నుంచి రైతులకు సాగునీరు అందిస్తామని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. వర్ని మండలంలోని సిద్దాపూర్‌ శివారులో నిర్మిస్తున్న రిజర్వాయర్‌ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని, అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. జూన్‌ నాటికి రిజర్వాయర్‌ పనులు పూర్తి చేసి 14వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు స్పీకర్‌ వెల్లడించారు. రిజర్వాయర్‌ ఆధునికీకరణతో సుమారు 500 ఎకరాల అటవీ భూమి నీట మునగడం సమస్యగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్‌, డీఎఫ్‌వో, ఇరిగేషన్‌ అధికారులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. అటవీ భూమి నీట మునుగుతున్న దృష్ట్యా ఎంత భూమి కోల్పోతే అంత భూమిని అటవీ శాఖకు అప్పగించి చెట్ల పెంపకం కోసం కలెక్టర్‌ ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందించినట్లు పేర్కొన్నారు. రిజర్వాయర్‌ నిర్మాణంతో ఒక టీఎంసి నీటి నిల్వ ద్వారా వర్ని, బాన్సువాడ, బీర్కూరు, గాంధారి మండలాల పరిధిలో గల పంట భూములకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ప్రధాన నీటి సమస్య గల గాంధారి మండల రైతాంగానికి భూగర్భ జలాలు పెరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, డీఎఫ్‌వో వికాస్‌ మీనా, ఇరిగేషన్‌ డీఈ శ్రీనివాస్‌, ఆర్డీవో రాజేశ్వర్‌, తహసీల్దార్‌ విఠల్‌, నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ హరిదాసు, నాయకులు గిరి, గోపాల్‌, వీర్రాజు, సర్పంచ్‌ కన్న ప్రభ, కలియబాయి దశరథ్‌ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

ప్రతిపక్షంలో ఉన్న పార్టీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టడం, ఈడీ, సీబీఐ విచారణ పేరిట అక్రమ అరెస్టులు చేయించి కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని స్పీకర్‌ పోచారం అన్నారు. సిద్దాపూర్‌ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ ఎంపీ రాహుల్‌ గాంధీని అనర్హుడిగా ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఖైదీలకు అండగా న్యాయసేవాసంస్థ



మాట్లాడుతున్న రాజ్‌కుమార్‌ సుబేదార్‌

ఖలీల్‌వాడి: న్యాయస్థానాల విచారణలో ఉన్న క్రిమినల్‌ కేసుల్లో ముద్దాయిల తరపున న్యాయ సాయం అందించడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తుందని చీఫ్‌ లీగల్‌ డిఫెన్స్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ రాజ్‌కుమార్‌ సుబేదార్‌ అన్నారు. నిజామాబాద్‌ నగర శివారులోని సారంగపూర్‌లోని జిల్లా జైలులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. అండర్‌ ట్రయల్‌ ఖైదీలకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడిన వారికి, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. నేర జీవితం ప్రమాదమని సమాజంలో అందరితో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. నేరారోపణలు ఉన్నంత మాత్రాన నేరస్థులు కాదని నేర నిరూపణ అయినప్పుడే నేరస్తులు అవుతారన్నారు. ఖైదీల తరపున కేసులను వాదించడానికి లీగల్‌ ఎయిడ్‌ కౌన్సిల్‌ సిస్టమ్‌ను ప్రారంభించారని పేర్కొన్నారు. ఉదయ్‌ కృష్ణ, శుభం ప్రమోద్‌ లీగల్‌ ఎయిడ్‌ సిస్టమ్‌ గురించి వివరించారు. ఈ సదస్సులో జైలర్‌ రాజశేఖర్‌ రెడ్డి, డిప్యూటీ జైలర్‌ సాయి కుమార్‌ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీదేవి

కామారెడ్డి క్రైం: బాలికలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా జడ్జి శ్రీదేవి అన్నారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోక్సో, జేజే చట్టాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి మాట్లాడుతూ.. పోక్సో కోర్టును ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ మాట్లాడారు. గ్రామస్థాయిలో పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణపై కళాజాత ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. బాలికలను వేధిస్తే చట్టం ప్రకారం పడే శిక్షలను వివరించాలన్నారు. రాష్ట్ర ప్రొటెక్షన్‌ ఆఫ్‌ చైల్డ్‌ రైట్స్‌ కమిషన్‌ సభ్యురాలు అపర్ణ, ఎస్పీ శ్రీనివాస్‌ రెడ్డి, అడిషనల్‌ జడ్జి శ్రీనివాస్‌ నాయక్‌, అడిషనల్‌ ఎస్పీ అన్యోన్య, సీడబ్ల్యూసీ చైర్మన్‌ సత్యనారాయణ రెడ్డి, కన్సల్టెంట్‌ డేవిడ్‌ రాజు, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్రవంతి పాల్గొన్నారు.

స్పీకర్‌ను సన్మానించిన సెర్ప్‌ ఉద్యోగులు



స్పీకర్‌ను సన్మానిస్తున్న సెర్ప్‌ ఉద్యోగులు

బాన్సువాడ రూరల్‌: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెర్ప్‌ ఉద్యోగులకు పేస్కేల్‌ వర్తింపచేయడాన్ని హర్షిస్తూ నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలకు చెందిన ఉద్యోగులు శనివారం బాన్సువాడలో స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు, స్పీకర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీడీ మురళీకృష్ణ, డీపీఎం రవీందర్‌, సుధాకర్‌, యూనియన్‌ అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శి సాయిరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

చెరువులో పడి పశువుల కాపరి మృతి



రెంజల్‌(బోధన్‌): మండలంలోని నీలా గంగాసాగర్‌ చెరువులో పడి గ్రామానికి చెందిన పశువుల కాపరి మదారి శ్రీనివాస్‌(30) మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. శ్రీనివాస్‌ తన ఆవులతో పాటు ఇతరుల ఆవులను మేతకు తీసుకెళ్లేవాడు. శనివారం మేతకు వెళ్లిన ఆవులు గంగాసాగర్‌ చెరువులోకి వెళ్లగా వాటిని బయటకు తోలేందుకు నీటిలో దిగిన శ్రీనివాస్‌ ఈతరాక నీటమునిగి చనిపోయాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దూస్‌గాంలో ఒకరు..



డిచ్‌పల్లి: మండలంలోని దుస్‌గాం గ్రామానికి చెందిన సిద్దుల రాజు(24) చెరువులో జారిపడి మృతిచెందినట్లు ఎస్సై గణేష్‌ తెలిపారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలో గల నల్లకుంట చెరువులో రాజు మృతదేహం సాయంత్రం తేలింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడు..

సదాశివనగర్‌: మండల కేంద్రంలో ఓ యువకుడు శనివారం ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. గ్రామానికి చెందిన మేకల ప్రసాద్‌(28) పాత కుర్మ సంఘ భవనం కూల్చి వేసేందుకు కూలీగా వెళ్లాడు. భవనం కూల్చిన తర్వాత అక్కడ ఉన్న కట్టెలను జోగు ఎల్లయ్య ఇంటి పక్కన జూడు వేయిస్తుండగా ప్రమాదవశాత్తు కట్టెలు నడుంపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌ తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



భూమవ్వ(ఫైల్‌)

నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌): బీర్కూర్‌ మండల కేంద్రానికి చెందిన కంగ్టి భూమవ్వ(55) మనస్తాపంతో శనివారం ఆత్మహత్య చేసుకుంది. భూమవ్వ భర్త కొద్దిరోజుల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె మనోవేదనకు గురి అవుతోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుంది. మృతురాలి కొడుకు రమేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో హోటల్‌ దగ్ధం



కామారెడ్డి క్రైం: షార్ట్‌ సర్క్యూట్‌తో హోటల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దాదాపు రూ. 20 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌ సమీపంలో ఉన్న రమేష్‌ ఫుడ్‌ కోర్ట్‌ హోటల్‌లో శనివారం వేకువజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హోటల్‌లో వేకువజామున నాలుగు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందగా సిబ్బంది బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. సమాచారం అందుకున్న ఫైర్‌ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే మొత్తం సామగ్రి, విలువైన వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు వ్యాపారి చెబుతున్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



కామారెడ్డి క్రైం: ఓ భూమి విషయంలో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. ఈ ఘటన కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఓ భూమి విషయంలో గత కొద్ది నెలలుగా లింగం అనే వ్యక్తి కుటుంబానికి, పోచయ్య కుటుంబానికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి రాళ్లు, కర్రలు, కారం పొడులతో దాడులు చేసుకున్నారు. దీంతో పలువురికి గాయలయ్యాయని దేవునిపల్లి పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

అకాల వర్షం

సిరికొండ: మండలంలోని తాటిపల్లి, చీమన్‌పల్లి, జినిగ్యాల గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల వర్షానికి కోతకు వచ్చిన వరి పొలాల్లో వడ్లు రాలిపోయాయి.



తాటిపల్లిలో వడ్లు రాలిపోయిన పొలం



కొండూర్‌లో తడిచిన వడ్లు



గడ్కోల్‌లో పసుపు కల్లంలో చేరిన వర్షం నీరు

విద్యుత్‌శాఖలో ఇన్‌చార్జీలకు అదనపు బాధ్యతలు

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న పలువురి ఇన్‌చార్జి సబ్‌ఇంజనీర్‌, ఏఏవోలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సీజీఎం ప్రభాకర్‌ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఇద్దరు సబ్‌ఇంజనీర్‌, ఏఏవో, జేఏవో, ఏఏఈలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు చార్జీలు ఇవ్వడంతో హోదాతో పాటు జీతాలు కూడా పెరగనున్నాయి. మన్మోహన్‌కు నిజామాబాద్‌ ఏఏవో నుంచి ఏవోగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. డి రాజశేఖర్‌కు బోధన్‌ జేఏవో నుంచి ఏఏవోగా, ఎస్‌ కృష్ణకు కోటగిరి ఏఏఈ నుంచి రుద్రూర్‌ ఏఏఈగా, జి రాజలింగంకు రెంజల్‌ సబ్‌ఇంజనీర్‌ నుంచి రెంజల్‌ ఏఏఈగా, కెఎస్‌ఆర్‌ మూర్తికి ఎల్లారెడ్డిపల్లి సబ్‌ఇంజనీర్‌ నుంచి ఏఏఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

నిజామాబాద్‌లో సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని ఏడుగురు సీఐలకు బదిలీలు జరిగాయి. శుక్రవారం ఐజీ పరిధిలోని పలు జిల్లాలకు చెందిన 19 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ అయిన స్థానం
సురేందర్‌రెడ్డి	సీసీఎస్‌, నిజామాబాద్‌	సౌత్‌ రూరల్‌ సీఐ, నిజామాబాద్‌
బి నరహరి	సీటీసీ, నిజామాబాద్‌,	నార్త్‌ రూరల్‌ సీఐ
ఎం శివకుమార్‌	వీఆర్‌, నిజామాబాద్‌	సీటీసీ, నిజామాబాద్‌
ఎస్‌ శ్రీలత	అలటెడ్‌ నిజామాబాద్‌	వీఆర్‌, నిజామాబాద్‌
కస్పరాజు కృష్ణ	వీఆర్‌, నిజామాబాద్‌	సీసీఆర్‌బీ, నిజామాబాద్‌
బి వెంకటేష్‌	వీఆర్‌, నిజామాబాద్‌	సీసీఎస్‌, నిజామాబాద్‌
జగదం నరేష్‌	సౌత్‌ రూరల్‌, నిజామాబాద్‌	టాస్క్‌ఫోర్స్‌-1, సిద్దిపేట్‌ కమిషనరేట్‌